# కథ

# పరిణామం

డా|| దిలావర్

**"ఇక** యింతటితో ఆపేద్దాం..." ఊగిసలాడుతున్న మనసును కుదుటపరచుకొని, ఒక నిర్ణయాని కొచ్చినట్టుగా అన్నాడు విశ్వనాథం.

"ఒకబ్బాయీ, ఒక అమ్మాయీ చాలు మనకు. ముందు జాగ్రత్త తీసుకోకుండా చాలా పొరపాటు చేశాం. ఇప్పటికైనా కళ్ళు తెరవక పోతే ముమ్ముందు చాలా యిబ్బందులు పడాల్సి వస్తుంది. వనజా! అబార్షన్ చేయించుకోక తప్పదు..." వనజ కళ్ళలోకి సూటిగా చూడలేక చూపులు పక్కకు తిప్పుకున్నాడు ఇబ్బందిగా.

వనజ మనసులో ఒక సముద్రకెరటం ఉవ్వెత్తున ఎగిసిపడింది. నేల చూపులు చూస్తున్న వనజను రెండు నిమిషాల పాటు మౌనం తన బాహువుల్లోకి తీసుకుంది.

"ఒంట్లో పూర్వపు శక్తి లేదు. అబార్షన్‌కు తట్టుకోలేనేమో. అదీగాక నాకింకా పిల్లల మీద మమకారం చావలేదు. అన్నెంపున్నెం ఎరగని నెత్తురు గుడ్డును చిదిమేసే హక్కు మనకు లేదండీ...." అన్నది వనజ. ఆమె మాటలు ఎక్కడో నూతిలోంచి వచ్చి నట్టుగా నీరసంగా వున్నాయి. ఆమె కళ్లలో ఏ క్షణాన్నైనా కురవడానికి సిద్ధంగా వున్న శ్రావణ మేఘాలు ముసురుకున్నాయి.

'వూc ..' నిట్టూర్చాడు విశ్వనాథం "నీ యిష్టం..." అన్నాడు అయిష్టంగానే. విశ్వనాథం ఓ హైస్కూలులో తెలుగు పంతులు. వచ్చే జీతానికీ ఖర్చులకూ ఎలాంటి పొంతనా లేకుండాపోతున్నది. పిల్లాడు అజయ్‌కి ఆరేళ్లు నిండాయి. అమ్మాయి సునీతకు మూడేండ్లు. ఇప్పుడు మళ్ళీ వనజ గర్భవతి

ముమ్ముందు ముగ్గురి ఆలనా పాలనా, చదువూ సంధ్యలూ చూసుకోవడం ఎంత కష్టమవుతుంది! ఈ ఆడవాళ్లు 'తెస్తే వండి పెడతాం, చస్తే ముండ మోస్తాం' అన్నట్టు వుంటారే తప్ప ఏ మాత్రం ఆలోచించరు అనుకున్నాడు విశ్వనాథం. అతడ్ని కొండ చిలువలా చుట్టేసింది నిస్పృహ.

కాలగర్భంలోంచి ఒక్కొక్క కొత్తరోజు పుట్టుకొస్తూనే వుంది. కాలక్రమంలో వనజ ఆడపిల్లకు జన్మనిచ్చింది. విశ్వనాథం గుండె గుభిల్లు మన్నది. చేయి కాలిన తర్వాత ఆకులు పట్టుకొని ఏం లాభం? ఇప్పుడు ఏమనుకుంటే ఏమొస్తుంది గనక? అనుకున్నాడు.

పుట్టినబిడ్డకు 'సుజన' అని పేరు పెట్టు కున్నారు నమ్మి నానబోస్తే పుచ్చి బుర్రలైనయంట. అట్లానే వుంది సుజన పరిస్థితి. పుట్టిందగ్గర్నుంచీ అన్నీ బాలారిష్టాలే.

ఈ కాన్పుతో వనజ మరీ బలహీనమైంది. పిల్లకు తల్లిపాలు చాలడం లేదు. డబ్బాపాలు తాపించడం మొదలెట్టారు. డబ్బాపాలు అరాయించు కోలేకపోతున్నది బిడ్డ. కడుపుబ్బరంతో రేయీపవళ్ళు - తుమ్మ చెట్టు మీది రింగన పురుగులా గీగీ... అంటూ ఒహటే ఏడ్పు.

అది చాలదన్నట్టు కొన్నాళ్ళకు సందులు సోకాయి. వీరబ్రహ్మాచారి దగ్గరికెళ్లి తాయెత్తులు కట్టించారు. సంది మాత్రలు మింగించారు. అలా నానా అగచాట్లు పడుతూ రెండేండ్లు దేకారు.

సుజనతో పాటు విశ్వనాథంలో అసహనం కూడా సమాంతరంగా పెరుగుతూ వచ్చింది. పులిమీద పుట్ర అన్నట్టు కొన్నాళ్ళకు సుజన ఒళ్ళంతా సెవపుండ్లు లేచాయి రసికారుతున్న పుండ్ల మీద యీగలు జొబ్బున ముసురు కొంటున్నాయి. ఆ రోత చూస్తుంటే విశ్వనాథానికి కడుపులో తిప్పినట్టవు తుంది. కూతుర్ని కడగంట కూడా చూడకుండా అంటీ ముట్టనట్టు వుంటున్నాడు విశ్వనాథం.

ఎంత అసహ్యంగా వున్నా తల్లికడుపు ఆగదు కదా! సుజనను ఓ నాటు వైద్యుని దగ్గరకి తీసుకుపోయింది వనజ. ఆయన కొబ్బరినూనెలో మేక పెంటికలు రంగరించి కోడి యీకతో సుజన ఒళ్ళంతా రాసేవాడు. ఏవేవో పసర్లు యిచ్చేవాడు. అయినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు వుండేది సుజన పరిస్థితి.

విశ్వనాథాన్ని భూతంలా పట్టుకున్నది అసహనం. ప్రతి చిన్న విషయానికి చిర్రుబుర్రు లాడటం మొదలుపెట్టాడు. · అత్తమీది కోపం దుత్తమీద చూపించినట్టు సుజన మీది కోపం వనజ మీద చూపించేవాడు. సుజన ఏడ్పువింటే, అదేదో తీతువు పిట్ట వికృతంగా అరుస్తున్నట్టు అనిపించేది విశ్వనాథానికి. ఒక్కోసారి సుజన ఏడ్పువింటే కోపం నసాళానికంటేది. 'పోరిని బండక్కొట్టు' అంటూ కసురుకునేవాడు.

విశ్వనాథం తిట్లనూ, ఆగ్రహాన్నీ మౌనంగా భరించేది వనజ. కళ్లలోని నీరుకళ్ళలోనే కుక్కుకునేది. తల్లడిల్లే మాతృహృదయంతో సుజనను గుండెలకు హత్తుకునేది.

వనజ పోరు భరించలేక చివరకు ఓ ప్రయివేటు ఆసుపత్రిలో సుజనకు చికిత్స చేయించాడు విశ్వనాథం. సెవ కాస్త నెమ్మదించింది.

నిమిషాలను గంటలు మింగేస్తున్నాయి. గంటలును రోజులు మింగేస్తున్నాయి. రోజుల్ని వారాలు, వారాలను నెలలూ, నెలలను సంవత్స రాలూ మింగి వేస్తూనే వున్నాయి. కప్పని మింగిన పాములా కాలం కదలలేక కదలలేక కదులుతూ వుంది. పెద్దపిల్లాడు అజయ్ డిగ్రీ చదువుతున్నాడు. సునీత సీనియర్ ఇంటర్‌కొచ్చింది. ముక్కుతూ మూల్గుతూ తాబేలు నడకతో సుజన టెన్త్‌క్లాస్ కొచ్చింది. వాళ్ల ఫీజులు, పుస్తకాలూ, గుడ్డలు అన్ని

ఖర్చులూ వెరసి తడిసి ముప్పందుం అవుతున్నాయి. టైటానిక్‌లా తన పుట్టి ఎప్పుడు మునుగుతుందో అనుకుంటూ భయం భయంగా సంసారాన్ని నెట్టు కొస్తున్నాడు విశ్వనాథం.

విశ్వనాథం ఓసారి టెన్త్‌క్లాస్ స్పాట్ వాల్యూయేషన్ కోసం వరంగల్ వెళ్లాడు. క్యాంప్ అయిపోయాక రెమ్యూనరేషన్ చేతికందింది. చెలమ తవ్వగా తవ్వగా ఎక్కడో పాతాళంలో వున్న భూగర్భ జలాల్లోంచి కొంచెం తేమ పైకి ఉబికినట్టు విశ్వనాథం పితృహృదయం కొంచెం ద్రవించింది. పిల్లలకూ, వనజకు బట్టలు కొందాం అనుకున్నాడు. అజయ్‌కు జీన్స్ పాంటూ, టీ షర్టూ కొన్నాడు. సునీత సుజనలకు సల్వార్, కమీజులు కొందాం అనుకున్నాడు. సెలక్షన్ కొంచెం కష్టమే అయింది. ఎంబ్రాయిడరీ చేసిన బంగారు రంగు కమీజ్ విశ్వనాథానికి బాగా నచ్చింది. సునీత అసలే అందంగా వుంటుంది. ఈ బంగారు రంగు డ్రెస్ గానీ వేసుకుంటే అచ్చు దేవకన్యలా మెరిసిపోతుంది అనుకున్నాడు. సుజనకు డ్రెస్ సెలక్ట్ చేసేటప్పుడు అతనికి తెలియకుండానే మనసులో ఏమూలనో గూడు కట్టుకున్న అయిష్టత తొంగి చూసింది. ముదురు ఎరుపురంగు డ్రెస్ సెలక్ట్ చేశాడు. ఆ డ్రెస్ ఏమంత నదురుగా లేదు 'ఆc .... ఏదయితేనేం లే... సుజన ఏడ్పుగొట్టు మొహానికి. ఎంత మంచి డ్రెస్సైనా ఏడ్చినట్టే వుంటుంది' అనుకున్నాడు. వనజకు ఓ మామూలు చీరా, జాకెట్ పీస్ తీసుకున్నాడు.

ఇంటికి వెళ్ళగానే వనజనూ, పిల్లలనూ పిలిచాడు. 'మీ కోసం ఏం తెచ్చానో చెప్పుకోండి' అంటూ ఊరించాడు. 'ఏంటబ్బా యీ అకాల వర్షం' అనుకుంటూ వచ్చి విశ్వనాథం చేతిలోని బట్టల్ని చూసి విస్తుపోయింది వనజ.

పిల్లలకూ, వనజకూ- ఎవరి కోసం కొన్న బట్టల్ని వారికిచ్చాడు విశ్వనాథం.

సుజన తనకిచ్చిన డ్రెస్సును మడతలు విప్పికిందికీ మీదికి - ఎగాదిగా చూసింది. నెత్తురులా ముదురు ఎరుపుగా వున్న డ్రెస్సును చూస్తుంటే తండ్రి తనకు కావాలనే అలాంటి చెత్త డ్రెస్సును తెచ్చాడనిపించింది సుజనకు. సునీత చేతిలో బంగారు రంగుతో ధగధగా మెరిసిపోతున్న డ్రెస్సును ఓరగంట చూసింది. సుజన మనసు తుకతుక ఉడికిపోయింది.

"ఇది కూడా అక్కడే యివ్వకపోయారా? నాకెందుకు తెచ్చారు? ముద్దుల కూతురికి అంత మంచి డ్రెస్సు, పనికిరాని డొక్కు డ్రెస్సు నాకూనా?" ఉక్రోషంతో అన్నది సుజన. ఆమె కళ్ళలో ఉబికి వస్తున్న కన్నీళ్ళను ఆపుకునేందుకు విఫల ప్రయత్నం చేస్తున్నది.

'నోర్మూసుకొని తెచ్చింది తీసుకో. ఏంటే ఆ వాగుడు? యిష్టమైతే తీస్కో లేకుంటే పారేయ్..' కూతురు ధిక్కారాన్ని జీర్ణించుకోలేక పోతున్నాడు విశ్వనాథం. కోపంతో ఊగిపోతున్నాడు.

'అన్నయ్యకు, అక్కయ్యకు ఏవి కావాలంటే అవి ఆఘమేఘాల మీద తీసుకొచ్చి యిస్తారు. నా దగ్గరి కొచ్చేసరికి ఎవరికీ చేతులు రావు. ఏమొద్దులే నాకు. అన్నీ వాళ్లకే యిచ్చుకోండి ...' డ్రెస్సును విసురుగా ఓమూలకు గిరాటేసి, వెక్కివెక్కి ఏడుస్తూ గదిలోకి వెళ్లి బెడ్‌మీద వాలిపోయింది సుజన.

తుఫాను వచ్చినప్పుడు కనిపించే బీభత్స వాతావరణం అక్కడ తాండవిస్తుంది.

'మరి దానిక్కూడా... సునీతకు తెచ్చి నటువంటి డ్రెస్సే... తేకపోయారా...?

వాతావరణాన్ని కాస్త తేలిక పరచాలన్న ఉద్దేశంతో - భయంభయంగానే అన్నది వనజ.

గcయ్యిమని ఇంతెత్తు లేచాడు విశ్వనాథం.

నువ్వు తెచ్చుకోలేకపోయావా నీముద్దుల కూతురికి ? నాకు నచ్చినవేవో తెచ్చాను. యిష్టమైతే తొడుక్కుంటుంది. లేకపోతే ఏంచేస్తుందో చేస్కో మను.' విసవిసా పెరట్లోకి వెళ్ళిపోయాడు విశ్వనాథం.

తిండి విషయంలో కూడా సుజనతో గొడవలే వచ్చేవి. క్షణాల్లో గాలిదుమారాన్ని రేపేది సుజన. క్యారెట్, బీన్స్, టమాటా, పచ్చిమిర్చి వేసి చేసిన కిచిడీ అంటే విశ్వనాథానికి అమితమైన యిష్టం. కిచిడీ చేసినప్పుడల్లా చిన్నపాటి ,యుద్ధ వాతావరణం అలుముకునేది ఆ యింట్లో. బీన్స్, క్యారెట్, ముక్కల్ని వెంట్రుకలు నోట్లోకి వస్తే ఉమ్మేసినంత వికారంగా నాలుకతో బయటకి తోసేది సుజన. 'తినవే. ఆరోగ్యానికి మంచిది' అని వనజ అంటే 'మీరే తినండి ' అంటూ ప్లేటును విసిరేసేది.

'ఈ యింట్లో. ఎవరికిష్టమైనవి వాళ్లు తింటాని క్కూడా లేదు' నిష్ఠూరంగా అంటూ లోని కెళ్లేది.

ఓసారి, తండ్రితో నేరుగా మాట్లాడే ధైర్యం లేక గుసగుసగా తల్లి చెవిలో ఏదో చెప్పింది సుజన.

నన్నడిగితే ఏం లాభమే. మా నాన్నగారిని అడుగు ' అన్నది వనజ. మళ్ళీ ఏం గొడవైపోతుందో అన్న భయం ఆమె మనసును వణికిస్తున్నది.


ఈ అమ్మాయి మళ్లీ ఏదో ఉపద్రవాన్ని మోసుకొచ్చింది అనుకున్నాడు విశ్వనాథం.

'ఏంటమ్మా నాన్నగారిని అడిగే అంత కొంప మునిగే విషయం?" వెటకారం మేళవించిన స్వరంతో అన్నాడు విశ్వనాథం.

'నాన్నగారూ! మరే... మా స్కూలు నుంచి అంతా ఎక్స్‌కర్షన్‌కు వెళ్ళుతున్నారు. నేను కూడా వెళ్దామనుకుంటున్నాను. మళ్లీ మళ్లీ యిలాంటి అవకాశాలు రావు కదా... రెండువేల రూపాయలు కట్టాలట.... అందుకని... మరి ... మరి...' పూర్తిగా చెప్పలేక గుటకలు మింగుతూ, నసుగుతున్నట్టు అన్నది సుజన.

అసలే తన జీతం గొర్రెతోక బెత్తెడే అన్నట్టు ఏమాత్రం ఎదుగూ బొదుగూ లేనిది. అందులోనూ తీసుకున్న లోన్ల కటింగులుపోను చేతికొచ్చే రొక్కం చాలా తక్కువ. అంతకంతకూ ఖర్చులు సుమో వస్తాదుల్లా బలిసిపోతుంటే తిండిలేక నీరసించిపోయే పిల్లాడిలా నానాటికీ జీతం బక్కచిక్కిపోతున్నది. ఇలాంటి పరిస్థితిలో వీళ్ల గొంతెమ్మ కోరికలు తీర్చడం - తనకు కాదు కదా తన బాబు, తాత, ముత్తాతలు దిగి వచ్చినా సాధ్యం కాదు అనుకున్నాడు విశ్వనాథం.

'నేను గాడిదనయ్యో, బూడిద నయ్యో సంసారాన్ని ఎట్లాగో అట్ల నెట్టు



కిన్నెర సంస్థ ఆధ్వర్యంలో ద్వా.నా.శాస్త్రి 63వ జన్మదినోత్సవ సభలో ద్వా.నా.శాస్త్రి రచించిన "ప్రాచీన కవిత్వంలో వ్యక్తిత్వ వికాసం" గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో డా॥ కె.వి.రమణాచారి, దూరదర్శన్ సంచాలకులు డా॥ పి.మధుసూదన్ రావు, సాంస్కృతికశాఖ సంచాలకులు డా॥ ఎం.కాంతారావు, శ్రీ గుడిపాటి, డా॥ బి.వి.పట్టాభిరాం, డా॥ ఎ.గోపాలరావులు వున్నారు.

కొస్తున్నాను. మీకెవ్వరికి నేను పడుతున్న నానా అగచాట్లు అర్థం గావటం లేదు. ఈ మధ్య అందరికీ సోకులూ, షికార్లూ ఎక్కువైపోతున్నాయి. ఎక్స్‌కర్షనట...ఎక్స్‌కర్షన్... మీరి లాగే సతాయిస్తే... మీ చదువులు కూడా మాన్పించవలసి వస్తుంది. ....జాగ్రత్త' ఉరుములు మెరుపులూ లేకుండా పిడుగులు పడ్డట్టు పెద్దగా కేకలేశాడు విశ్వనాథం.

ఎప్పుడూ తన ఆశల మీద తండ్రి నీళ్ళు చల్లుతూనే వున్నాడు. అయినా తను ఏం చేస్తుంది గనక?

"అన్నయ్యకయితే ఎటువెళ్లానన్నా వేలకు వేలు ధారపోస్తారు..." తన మనసులో వున్న అక్కసు వెళ్ళగక్కింది సుజన.

మగపిల్లాడితో దీనికి పోటీ ఏమిటి? రేపు యింటి బరువు బాధ్యతలు మోయవలసిన వాడు వాడేకదా? ఆఖరికి తనకు తల కొరివి పెట్టవలసిన వాడు కూడా వాడే కదా? రానురాను దీనికి వెర్రి ముదురుతున్నది అనుకున్నాడు విశ్వనాథం.

"వాడు మగపిల్లవాడు. వాడితో నీకు సాపత్య మేంటి?" మనసులోని మాట పైకే అనేశాడు.

'మరి అక్కయ్యకు కూడా యిస్తారు కదా....?" తన నొక్కదాన్నే ఉద్దేశ పూర్వకంగా చిన్న చూపు చూస్తున్నారన్న భావన సుజన మనసులో పాతుకు పోయింది.

'ఆc... నీ లాజిక్కు సమాధానమిచ్చే వోపికా, తీరుబాటూ, అవసరమూ నాకు లేదు. ఇప్పుడు ఏ పూటకాపూట గడవడమే కనాకష్టంగా వుంది. ముప్పూటలా కాలు మీద కాలు వేసుకొని తినే మీకు నా కష్టాలు ఏం తెలుస్తాయి?' వంటి మీద ఏవో పురుగులు పాకుతుంటే దులపరించు కున్నట్టు మాటలు దులప రించాడు విశ్వనాథం.

ఇంతవరకు మినుకుమంటున్న ఆశ పూర్తిగా ఆరిపోయినట్టనిపించింది సుజనకు. ముసిరిన చీకట్లలో ముసురు కమ్ముకున్నట్టు సుజన గుండెలో బాధ సుడులు తిరిగింది.


'ఛీఛీ... ఎందుకన్నారో నన్ను? పుట్టగానే గొంతు పిసికి చంపేస్తే పీడా వదిలేది. అప్పుడు యీ రంకెలూ, పెడబొబ్బలూ వినవలసిన అగత్యం తప్పేది " గుండెలో గూడుకట్టుకున్న దుఃఖం కల్లోల సుడిగుండమై ఎగదన్ని కళ్ళలోంచి ధారాపాతంగా కన్నీరై ప్రవహిస్తుంటే విషణ్ణ వదనంతో అక్కడ్నుంచి కదిలింది సుజన.

అంతరంగాన్ని శోధిస్తున్నట్టు తనవైపు గుచ్చిగుచ్చి చూస్తూ సుజన అన్నమాటలు పిడుగుల్లా వినిపించే సరికి అదిరిపడ్డాడు విశ్వనాథం. ఎంత మాటన్నది సుజన! నిజంగా యాదృచ్ఛికంగా అన్నదా?లేక అంతా తెలిసే అన్నదా? మొదటిసారి విశ్వనాథం మనసు లేత తమలపాకులా వసివాడి పోయింది. నెత్తురు గుడ్డుగా వున్నప్పుడే అబార్షన్ పేరిట తను ఆమెను హత్య చేయాలనుకోవడం సుజనకు తెలుసా? తెలిస్తే తనను నాన్నా అని నోరార పిలుస్తుందా? తన ముఖం చూడ్డానికి యిష్టపడు తుందా? అసహ్యంతో తనను ఛీ కొట్టకుండా వుంటుందా? తను చేసిన తప్పు గుండెలో ముల్లులా గుచ్చుకుంటున్నది. మనసంతా అల్లకల్లోల సాగరమవు తున్నది. తన శరీరంలోని రక్తాన్నంతా ఎవరో తోడేసినట్టు ఢీలా పడి, కణతలు నొక్కుకుంటూ కుర్చీలో కూలబడ్డాడు విశ్వనాథం.

భర్తవైపు ఓసారి మ్లానవదనంతో చూసి, రెండు చేతులతో ముఖం కప్పుకొని ఏడుస్తూ వంట గదిలోకి వెళ్ళిపోయింది వనజ.

÷÷÷

ఏమి ఎరగని నంగనాచిలా, కనిపించే కాలం, తెరలు తొలగించుకొని ప్రతిరోజూ, రేపటిలోకి తొంగి చూస్తూ రకరకాల దృశ్యాలను గర్భంలో నిక్షిప్తం చేసుకుంటున్నది. కొందరి జీవితాల్లో హేమంతం నింపుతున్నది. కొందరి బతుకుల్లో శిశిరాన్ని కుక్కుతున్నది. మరి కొందరి గుండెల్లో గ్రీష్మాన్ని మండిస్తున్నది. ఇంకొందరి జీవితాల్లో వసంతాన్ని అద్దుతున్నది. ఎవ్వరితోనూ నిమిత్తం లేని కాలం తన యిష్టమొచ్చిన శ్రుతిలో రుతురాగం వినిపిస్తున్నది.




డా॥ రెంటాల శ్రీ వెంకటేశ్వరరావు హాస్యరచనల సంపుటి 'నవ్వుమొహం' పరిచయసభ 24 మే 2010న తణుకులో జరిగింది. పుస్తక సమీక్ష చేస్తున్నవారు డా॥ వాడ్రేవు వీరలక్ష్మీదేవి గారు. వేదిక మీద (ఎడమ నుండి కుడికి) మరో సమీక్షకులు ప్రసిద్ధ కవి కొప్పర్తి అధ్యక్షత వహించిన ప్రముఖ కవి, కథా రచయిత డా॥ తల్లావజ్ఝల పతంజలిశాస్త్రి, రచయిత డా॥ రెంటాల కూడా ఉన్నారు.

అజయ్ పెళ్లైంది. కోడలు కాపురానికి వచ్చింది. వాళ్ళకు యిద్దరు పిల్లలు కూడా కలిగారు. కట్నం డబ్బులు తానే మూటగట్టుకోవడంతోపాటు, భర్తను కూడా కొంగున ముడేసుకుంది. కోడలు.

సునీత పెళ్లి కూడా అయిందనిపించాడు విశ్వనాథం. గంతకు దగ్గ బొంత అన్నట్టు ఓ కారు డ్రైవరుకిచ్చి చేతులు దులుపుకున్నాడు. వాళ్ళకూ యిద్దరు పిల్లలు పుట్టారు. బతుకు తెరువును వెతుక్కుంటూ, భార్యాపిల్లల్ని చంకనబెట్టుకొని దుబాయ్‌కి చెక్కేశాడు అల్లుడు. మూడు నాలుగేండ్ల కోసారి గాని స్వదేశం మొహం చూడటం లేదు వాళ్ళు.

విశ్రాంతిగా వాలు కుర్చీలో కూచొని, సోడాబుడ్డి కళ్ళద్దాలు పెట్టుకొని, తీరుబడిగా తెలుగు కావ్యాలు తిరగేస్తున్నాడు విశ్వనాథం. సర్వీస్ బెనిఫిట్స్‌తో అప్పులన్నీ తీర్చేశాడు. అజయ్ వ్యాపారం చేసుకుంటానంటే కొంత డబ్బు మదుపు పెట్టాడు. కట్నం కింద సునీత క్కూడా కొంత ముట్టజెప్పాడు. ఇక సుజన పెళ్ళే సశేషం అయింది. విశ్వనాథం దగ్గరున్న డబ్బులన్నీ హళ్ళికి హళ్ళీ, సున్నాకు సున్నా అయ్యాయి. నెలనెలా వచ్చే పెన్షన్ రాళ్ళతోటే జీవికను నెట్టుకొస్తున్నాడు.

కాలవైపరీత్యానికి కారణాలేముంటాయి గనక? సీతమ్మను భూదేవి తనలో కలుపుకున్నట్టు, వనజను తనలో కలుపుకున్నది కాలం. ఇంతవరకూ వనజ తన నీడ మాత్రమే అనుకున్నాడు విశ్వనాథం. కానీ అహర్నిశలు తనకు తోడునీడై సేవలు చేసే ఆ చల్లని నీడను ఏ చీకట్లు మింగేశాయో అర్థం కాలేదు. ఇప్పుడిప్పుడే తెలుస్తున్నది. జీవితంలో తను సర్వస్వం కోల్పోయాడని. జంట బాసిన ఒంటరి పక్షిలా విశ్వనాథం గుబులు గుబులుగా దిగులు దిగులుగా రోజులు వెళ్ళమారుస్తున్నాడు. మాట వినని శరీరంతో పాటు, మానసిక వేదన కూడా తోడై విశ్వనాథాన్ని కుంగదీస్తున్నవి.

ఇంతలో ఓ రోజు సునామీ లాంటి దిగ్భ్రాంతికర వార్త వినవలసి వచ్చింది విశ్వనాథం. ఒక తండ్రి వల్ల ఊదుకాలదు, పీర్లు లేవవు అనుకున్నదో ఏమో. సుజన స్వతంత్రించి ఓ అడుగు ముందుకేసింది. ఆ పిల్ల చిన్నప్పట్నుంచీ అంతే. 'గుంపులో గోవిందా అన్నట్టు వుండడం ఆమెకెప్పుడూ యిష్టం వుండదు. ఇప్పుడు వికసించిన సొంత

వ్యక్తిత్వం ఆమెది. తను అనుకున్నది సాధించే దాకా వదలని పట్టుదల ఆమెది.

ఉన్న ఊళ్లోనే ఒకబ్బాయిని ప్రేమించి రిజిస్టరు మ్యారేజి చేసుకుంది. అబ్బాయిది కులంగాని కులమని విశ్వనాధం తెగ గింజు కున్నాడు. మొదట తీవ్రంగా వ్యతిరేకించినా తర్వాత తర్వాత చేసేదేం లేక మిన్నకున్నాడు. మొదట్నుంచీ అంతే. సుజన చేసే పనులన్నీ తనకిష్టంలేనివే చిన్నప్పట్నుంచీ సుజన మీద అయిష్టాన్ని పెంచుకోవడం వల్ల అలా అనిపిస్తున్నదా? లేక నిజంగానే సుజన తనకయిష్టమైన పనులు చేస్తున్నదా? ఏది ఏమయినా గుడ్డి కంటే మెల్లమేలన్నట్టు అసలు పెళ్ళి కాకుండా వుండటం కంటే కొంత నయమే కదా! ఒక విధంగా చూస్తే తన చేత చిల్లిగవ్వ కూడా లేని పరిస్థితుల్లో తన పరువు బజారున పడకుండా సుజన ఆదుకున్నది అని తన మనసుకు సమాధానం చెప్పుకున్నాడు విశ్వనాధం.

కోడలు అజయ్‌ని ప్రతి విషయంలోనూ ఏమార్చేది. అజయ్ కూడా పూర్తిగా మారిపోయాడు. పెళ్ళాం మాట జవదాటని పత్నీవ్రతుడయ్యాడు.

నెల నెలా వచ్చే పెన్షన్ డబ్బులు కొడుకే తీసుకుంటున్నాడు. తన అవసరాలు వాడు తీర్చకపోతే మరెవరు తీరుస్తారు అనుకున్నాడు.

ఓ రోజు "అజయ్! ఎప్పుడో కుట్టించుకున్న చొక్కాలు పూర్తిగా చినిగిపోయాయి. ఒక్క చొక్కా కుట్టించరా....' అంటూ – కొడుకు ఏమంటాడో అన్న భయం లోపల పీకుతున్నా అడగక తప్పని పరిస్థితి కాబట్టి మెల్లగా అడిగాడు.

అజయ్ పలకలేదు ఉలకలేదు. బెల్లం కొట్టిన రాయిలా తల కిందికి వంచుకొని మౌనంగా వుండి పోయాడు.

'ఇప్పుడెక్కడికి వెళ్లాలట? పెళ్లికా పేరంటానికా? కృష్ణారామా అనుకుంటూ ఓ మూలన పడివుండక యీ సోకులూ, షికార్లూ ఎందుకు? పిల్లల చదువులూ, ఫీజులూ, పుస్తకాలూ ఎట్లారా భగవంతుడా అని మేం పిసుక్కొని ఛస్తుంటే మధ్యలో మీ వూరేగింపేంటి?' వడగళ్ళ వానలా విరుచుకు పడింది కోడలు.

విశ్వనాధం మనసు చివుక్కుమన్నది. చిన్నప్పుడు ఒక్కగానొక్క మగపిల్లాడని అజయ్‌ని ఎంత గారాబంగా చూసుకునేవాడు. నలుగురిలో తన పిల్లాడు దొరబాబులా కనిపించాలని ఎంతగా ఆరాట పడేవాడు. ఇంట్లో ఎవరికున్నా లేకున్నా లెక్క చేయకుండా అజయ్‌కు ఎప్పుడూ మంచి డ్రెస్సులు కొనిచ్చేవాడు. ఇప్పుడు తాను నోరువిడిచి అడిగినా ఒక్కచొక్కా కుట్టించేందుకు వాడికి మనసొప్పడంలేదు. అయినా బతుకే చిరుగులమయం అయిపోతున్నప్పుడు చొక్కా చిరిగిపోయిందని దేవులాడ్డం అర్థంలేని విషయ మనుకున్నాడు విశ్వనాధం. అతని అణు వణువునూ నిర్వేదం ఆక్రమించుకున్నది. భారంగ నిట్టూరుస్తూ అక్కడ్నుంచి కదలడానికి ఓ అడుగు వేశాడు..

'నాన్నా!' వాకిట్లో నుంచి పిలుపు వినిపించింది. తలెత్తి చూశాడు విశ్వనాధం. సుజన వాకిట్లో నుంచొని వుంది. సంభ్రమాశ్చర్యాలతో విశ్వనాధం గుండె జలదరించింది. తన కళ్ళను తనే నమ్మలేకపోతున్నాడు. ఒంట్లో రక్తం ఎగబాకి నట్టనిపించింది. ఉద్వేగంతో 'అమ్మా! సుజనా!' అన్నాడు వణుకుతున్న గొంతుతో .

సుజన గబగబాలోనికి వచ్చింది. 'మీకిష్టం లేని పని చేశాను. అసలు మీకిష్టమైన పనులు ఎప్పుడు చేశాను గనక. పెద్దమనసుతో నన్ను క్షమించండి నాన్నా!' అంటూ వంగి తండ్రి పాదాలకు నమస్కరించింది సుజన. క్రస్టుగేట్లు ఎత్తగానే రిజర్వాయర్లోని నీళ్ళు ఒక్క వుదుటన ప్రవహించినట్టు, ఆమె కళ్ళ లోంచి ధారాపాతంగా కన్నీళ్ళు ప్రవహిస్తున్నాయి.

అనుకోని యీ సంఘటనతో ఉక్కిరిబిక్కిరి అయ్యాడు విశ్వనాధం. కొంతసేపటికి తేరుకొని ఆప్యాయంగా సుజన భుజాలు పట్టుకొని లేపాడు. అతనికి ఏం మాట్లాడాలో తోచడంలేదు.

'ఎలా వున్నారు నాన్నా? మీ ఆరోగ్యం బాగుందా? వేళకు అన్నం తింటున్నారా? కన్నీళ్ళు తుడుచుకుంటూ ప్రేమగా ప్రశ్నల వర్షం కురిపించింది సుజన.

ఎడారిలో గమ్యం లేకుండా చక్కర్లుకొడుతున్న ఒంటరి పక్షికి, ఓ చల్లని చెట్టు తన కొమ్మను ఆశ్రయంగా యిచ్చినట్టుగా వుంది విశ్వనాధానికి. ఎన్నాళ్ళయింది అలాంటి ఆత్మీయ పలకరింపు విని! అతని కళ్ళలో సన్నని కన్నీటి పొర లీలగా కదలాడింది.

చేతిలోని పాలిథిన్ కవర్ తండ్రికందిస్తూ 'తీసుకోండి' నాన్నా!' అన్నది సుజన. 'మీకిష్టమైన రెండు బంగారు రంగు పట్టు చొక్కాలు, జత పంచెలూ, రెండు కండువాలూ తెచ్చాను..." అన్నది సుజన, చిన్నపిల్లాడికి మురిపెంగా తాయిలం అందించే తల్లిలా.

'బంగారు రంగు' అన్నమాట వినిపించగానే గుండెలో ఏ మూలో కలుక్కుమన్నది విశ్వనాధానికి. తనకిష్టమని తెచ్చిందంట సుజన. మరి తాను ఎప్పుడైనా సుజన యిష్టాయిష్టాలను పరిగణనలోకి తీసుకున్నాడు? ఆమెతో ఎన్నడైనా మనసు విప్పి ఆప్యాయంగా మాట్లాడాడా? అవన్నీ ఏవీ సుజనకు

## నానీలు

**మేరెడ్డి యాదగిరిరెడ్డి**

నేటి వ్యవసాయం
ఓ మాయాజూదం
అడుగడుగునా
శకుని మామలు.

రైతు
పరమపద సోపానంలో
నిచ్చెనలు లేవు
అన్నీ నోళ్ళు తెరిచిన పాములే

తూర్పున
వరదగూడు
ఆశలపల్లకిలో
పంటచేను.

గుప్పిట
గుట్టురట్టు
సమాచారం
హక్కు

పంటభూములన్నీ
'సెజ్' లుగా మారినవేళ
అన్నమో
రామచంద్రా!

పంటపొలాల
చుట్టూ
దళారి గద్దల
కొంగజపాలు

జ్ఞాపకం లేవా? నిజంగా వాటన్నింటినీ మనస్ఫూర్తిగా మరిచి పోగలిగిందా? తాను ఎరిగిన సుజనేనా యీమె? సుజన యింతలా మారిపోయిందంటే నమ్మశక్యం కాకుండా వుంది విశ్వనాధానికి.

'ఎందుకమ్మా నాకు...? నీకు నేనేం చేశానని... ? పొడిపొడిగా అన్నాడు విశ్వనాధం.

'అదేంటి నాన్నా అలా అంటారు? మీరు ఏం చేయందే మేం యింతటి వాళ్ళమయ్యామా...? అన్నది సుజన.

సుజన నిజాయితీగానే అంటున్నదా?లేక దెప్పిపొడుస్తున్నదా? సుజన కళ్ళలోకి సూటిగా చూశాడు విశ్వనాధం. శరత్కాలపు మేఘాల్లా స్వచ్ఛంగా, నిర్మలంగా వున్నాయి సుజన కళ్ళు గతంలో అనుభవించిన అవమానాల తాలూకు నీలినీడలు ఆమె కళ్ళలో ఎక్కడా ప్రతిబింబించడం లేదు.

'నాన్నా! మీ అల్లుడి గారికి ఉద్యోగం దొరికింది. తన మొదటి జీతం ఇవ్వాళే వచ్చింది. నాకు అమ్మా నాన్నా ఎవరూ లేరు. మీ నాన్నగారే నాకూ నాన్నగారనుకుంటాను" అని మీకు యీ బట్టలు తెచ్చాడు నాన్నా! గతం మరచిపోయి, మమ్మల్ని మన్నించియివి తీసుకోండి నాన్నా!' అన్నది సుజన తండ్రిని అభ్యర్థిస్తూ.

వణుకుతున్న చేతులతో కవరు అందు కున్నాడు విశ్వనాధం. ఆప్యా యంగా సుజన తల మీద చేయిపెట్టి నిమిరాడు. జీవితంలో తాను కోల్పోయిన అమూల్య వస్తువేదో తిరిగి దొరికినప్పుడు మీటలకందని ఆనందంతో వుప్పొంగి పోయే తల్లి మనసులా, సుజన మనసు ఆనందడోలికల్లో ఒలలాడుతోంది. 'వస్తా నాన్నా' అంటూ తండ్రి దగ్గర సెలవు తీసుకుంది సుజన.

కాలం ఫైలుకి మరికొన్ని కాగితాలు చేర్చబడ్డాయి...

కోడలు చేసే ఉప్పుకారం లేని చప్పిడి తిండితో విశ్వనాధం నాలుక చప్పబడి పోయింది. చాన్నాళ్ళ నుండి విశ్వనాధం నాలుక పీకుతోంది. జిహ్వ చాపల్యాన్ని ఆపుకోలేక ఓ రోజు 'బాబూ అజయ్! కిచిడీ తిని చాన్నాళ్ళయింది. మీ అమ్మ వున్నప్పుడు ఎంతో రుచికరంగా కిచిడీ వండి పెట్టేది. ఇన్నాళ్ళకు మళ్లీ కిచిడీ మీదకు మనసు లాగుతున్నది. కోడలు పిల్లతో ఇవాళ కిచిడి చేయమని చెప్పరా!' అని ఆశగా కొడుకుని అడిగాడు విశ్వనాధం.

"హూఁ" అన్నాడు అజయ్ అతి కష్టం మీద గొంతు పెకల్చుకొని.

"ఎట్లాగో అట్లాగ గడిచిపోతుంటే సంతోషించక, ఈయనగారికి కిచిడీ కావాలంట.... కిచిడీ..... కిచిడీ అన్నా , పొంగలి అన్నా పిల్లలు వాక్కుమంటూ వాంతి చేసుకుంటారు. పిల్లలకు ఏవి యిష్టముండవో ఈయన గారికి అవే కావాలి. నాకు పది చేతులులేవు, తలోరకం వంట చేసి పెట్టడానికి. ఏం వండితే అది తినండి లేకపోతే లేదు" కసురుకుంటున్నట్టు అని విసురుగా వంటింట్లోకి వెళ్ళిపోయింది కోడలు.

గతుక్కుమన్నాడు విశ్వనాధం. పసితనంలో తన గుండెల మీద గులాబీల లాంటి గెండెలో గునపాలు గుచ్చుకున్నట్టు విలవిలలాడేవాడు. ఉగ్గుపాల దగ్గర నుండి గోరుముద్దలు తినిపించే వరకు వనజను పక్కన కూచోపెట్టి – తానే బలవంతం చేసి ఆమెతో చేయించేవాడు. అద్దాల నాడు బిడ్డలుగాని గద్దాల నాడు కాదు కదా అనుకున్నాడు విశ్వనాధం.

ఇంతలో సుజన వచ్చింది ఎండిపోతున్న నారు మీద వానజల్లు కురిసినట్టు అనిపించింది విశ్వనాధానికి. ఆర్ధ్రమైన కళ్ళతో స్వాగతం పలికాడు.

"నాన్నా ఇవ్వాళ మీరు మా ఆతిధ్యం స్వీకరించాలి. మీ అల్లుడుగారు తీసుకొని రమ్మన్నారు. వదినా!ఇవ్వాళ్ల నాన్న మా యింటి దగ్గరే వుంటారు. తీసుకెళ్లంటావా...?' అన్నది సుజన.

ఓ పూట తిండి ఖర్చు తగ్గినా తగ్గినట్టే అనుకున్నదేమో ' దానికేం భాగ్యం... మీనాన్నని నువ్వు తీసుకెళ్ళుతుంటే నేను ఎందుకు వద్దనాలి. తీసుకెళ్ళమ్మా..' సన్నాయి నొక్కులు నొక్కుతూ అన్నది కోడలు.

సుజన తండ్రిని వెంటబెట్టుకొని వెళ్ళింది.

తండ్రిని కుర్చీలో కూచో బెట్టి 'నాన్నా! ఇవ్వాళ నా పుట్టిన రోజు. మరిచేపోయ్యారా...? అన్నది సుజన.

నిత్యం చస్తూబతుకుతున్న తనకు ఎవరి పుట్టిన రోజు ఎప్పుడో, ఎవరిగిట్టిన రోజు ఎప్పుడో ఎలా గుర్తుంటుంది? అయినా మంచిగా వున్నప్పుడు మాత్రం తను సునను ఎప్పుడు పట్టించుకున్నాడు గనుక.

'నన్ను నేనే మరచిపోయే రోజులొచ్చాయమ్మా! ఏం గుర్తుంటుందిప్పుడు? అయినా గుర్తుచేశావు కదా? చల్లగా నూరేండ్లు బతుకు తల్లీ!' అంటూ మనస్ఫూర్తిగా దీవించాడు విశ్వనాధం.

'నాన్నా నీకిష్టమని కిచిడీ ....పొంగలి .... చేశాను' అంటూ తండ్రికి కొసరి కొసరి వడ్డించింది సుజన.

చిన్నప్పుడు, తినుమని కిచిడీ వడ్డిస్తే నానా యాగీ చేసేది సుజన. అలాంటిది తనకోసం కిచిడీ చేసింది. సుజనలో వస్తున్న మార్పు విశ్వనాధానికి ఆశ్చర్యం కలిగిస్తుంది.

"నువ్వెప్పట్నుంచి తింటున్నా వమ్మా కిచిడీ?" అన్నాడు ఆశ్చర్యంలోంచి తేరుకోకుండానే.

"నేను తినడం లేదు నాన్నా! మీ కిష్టమని చేశాను" అన్నది సుజన.

విశ్వనాధం కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. ఆబగా కిచిడీ, పొంగలి ఆరగించాడు విశ్వనాధం.

అగాధంలా నోరు తెరుచు కున్న కాలంలోకి మరికొన్ని రోజులు దూకేశాయి.

తనకా వయసు పైబడు తున్నది. ఇంక కొన్నాళ్ళుపోతే కూచోవడం లేవడం కూడా కష్టమై పోతుంది. శక్తి పూర్తిగా వుడిగి పోక ముందే కొన్ని పుణ్యక్షేత్రాలు చూసి వస్తే పుణ్యం పురుషార్ధం దక్కుతాయి అనుకున్నాడు విశ్వనాధం.

ఓ రోజు "ఒరేయ్ అజయ్! నాకు పుణ్యక్షేత్రాలు చూడాలని అనిపిస్తుందిరా! ఈ నెలలో తీర్థయాత్ర లకు స్పెషల్ బస్సులేస్తారట. ఓ అయిదు వేలుంటే సర్దగలవా...? ఏమంటాడన్న భయం లోపల పీకుతున్న పుణ్య క్షేత్రాలు చూసి రావాలన్న కోరికను చంపుకొని కొడుకును అడిగాడు విశ్వనాధం .

''హూఁ'' వ్యక్తిత్వం లేని ఒంటరి అక్షరాన్ని ఎప్పటిలాగే అప్పగించాడు అజయ్.

'ఏం? చేసిన పుణ్యాలు చాలవా? తీర్థయాత్ర లనీ అవనీ యివనీ ఎందుకిలా మా ప్రాణాలు తోడేస్తున్నారు? దేశంగాని దేశం వెళ్ళి అక్కడ ఏమన్నా అయితే నలుగురూ మమ్మల్ని



రాజమండ్రి కవిత్వం సంస్థ ఆధ్వర్యంలో మే 23వ తేదీ వి.నాగలక్ష్మి "ఊహలపల్లకి" కవితా సంపుటిని ముఖ్య అతిథిగా శ్రీ అద్దేపల్లి రామమోహనరావు గారు ఆవిష్కరిస్తున్న చిత్రం.

ఆడిపోసుకోడానికా? ' కోడలు నోటినుండి వస్తున్న మాటల వుధృతి, వూళ్ళకు వూళ్లు ముంచెత్తే వరద గోదారి ప్రవాహంలా వుంది.

ఏును. పిల్లలకు తండ్రిగా తను ఎన్నో చేసి వుండొచ్చు. అది తన బాధ్యత కూడా తిరిగి ఏ తండ్రీ పిల్లల నుండి ప్రతిఫలాన్ని ఆశించడు కదా. పిల్లలు ముందు ఆసరా అవుతారని ఆశిస్తే తన గతి ఏమయింది? తన పిల్లలు తనకు ఏదో చేస్తారని ఆశల్ని పెంచుకోవడం తనదే తప్పు అనుకున్నాడు విశ్వనాథం.

గ్రీష్మంలోకి వసంతం పాదం మోపినట్టు సమయానికొచ్చింది సుజన. కోడలు మాటలు విన్నట్టే వుంది.

'ఎప్పట్నుంచో మేమే నాన్నను తీర్థయాత్రలకు పంపించాలని అనుకుంటున్నాం మా పొరుగింటి వాళ్లు కూడా వెళ్తున్నారు. వాళ్ళతోబాటే నాన్నను పంపిస్తాను. దూర ప్రదేశాలకు వెళ్లినా నాన్నకేం భయం లేదు. వాళ్ళే అన్నీ చూసుకుంటారు. అన్నయ్యా! మీరేం కంగారు పడనక్కర్లేదు' అన్నది సుజన. వసివాడిపోతున్న విశ్వనాథం ఆశలకు మళ్ళీ జీవం పోసింది సుజన.

విశ్వనాథం మనసు పొరలను చీల్చుకుంటూ గతంలోని కొన్ని దృశ్యాలు అలలు అలలుగా కదలాడాయి. చిన్నప్పుడు సుజన ఎక్స్‌కర్షన్‌కు వెళతానని మారాం చేస్తే తానేమన్నాడు? ఆ సంఘటన గుర్తుకొచ్చి గుండెలోఎవరో యినుప చెయ్యిపెట్టి కెలికినట్లనిపిచింది. అపరాధభావనలోన తొలిచి వేస్తుంటే సుజన ముఖంకేసి చూడలేక చూపులు నేలకు దించుకున్నాడు విశ్వనాథం.

అనుకున్నట్లుగానే విశ్వనాథం ప్రయాణానికి అన్ని ఏర్పాట్లూ చేసింది సుజన. సుజన పుణ్యమా అన్ని పుణ్యక్షేత్రాలు దర్శించి వచ్చాడు విశ్వనాథం.

ఒకే గాడిన నడిస్తే అది జీవితమెట్లా అవుతుంది. ఎన్నో ఎత్తుపల్లాలు, ఎన్నో లోయలు, శిఖరాలు, ఎన్నో ఆటుపోట్లు, ఎన్నో వెలుగు నీడలు... అన్నిటి సమాహారమే జీవితం.

వృద్ధాప్యం పెద్దపులిలా విశ్వనాథం శక్తిని హరించి వేస్తున్నది. అశక్తత పిలువని పేరంటంలా వచ్చి బలవంతంగా కావలించుకుంటున్నది. నెమ్మదిగా రోగాలు శరీరం మీద దాడి చేయడం మొదలుపెట్టాయి. ఉబ్బసం, శత్రు సైనికునిలా విశ్వనాథం శరీరంలోకి దురాక్రమణ చేసింది.

తెల్లవార్లూ ఖళ్‌ఖళ్‌మని ఎడతెరిపిలేని దగ్గు వస్తున్నది. ఆయాసంతో శ్వాస అందక వుక్కిరి బిక్కిరవుతున్నాడు విశ్వనాథం 'వైద్యం చేయించరా!' అని విశ్వనాథం నోరు విడిచి అడిగినా నిమ్మకు నీరెత్తినట్టు వుంటున్నాడు అజయ్.

కోడలి గుణుసుడు మరీ ఎక్కువయింది "ఎప్పుడు వదులుతుందో పీడ. తెల్లవార్లూ అట్లా దగ్గుతుంటే ఇవతలి వాళ్ళకి నిద్ర ఎలా పట్టి ఛస్తుంది? ఆయనతో పాటూ మేమూ రోగాల పాలు కావాలని చూస్తున్నట్టుంది. అప్పుడు గానీ ఈయన గారి కళ్లు చల్లబడేట్టు లేవు' మబ్బు విడిచిన ఎండలాంటి తీక్షమైన మాటలతో విశ్వనాథం గుండెను తూట్లు పొడుస్తూ వుంది కోడలు.

విశ్వనాథం జబ్బు గురించి వాళ్ళూ వీళ్లూ అనుకుంటుండగా విన్నది సుజన 'అందరూ వుండి అనాథలా పడి వుండవలసి వస్తున్నది నాన్న' అనుకున్నది. తాము తిన్నా తినకున్నా మాకు ఏ లోటూ రాకుండా పెంచి పెద్దచేశారు. అమ్మానాన్న, అవమానాలు అనే నూనెలో వాళ్ల జీవితాలు సలసల మరిగినా ఆ బొబ్బలు మాకు కనిపించకుండా జాగ్రత్త పడ్డారు. తండ్రి పరిస్థితి సుజన హృదయాన్ని కలచివేసింది. ఆఘమేఘాల మీద తండ్రి దగ్గరి కొచ్చి వాలింది.

"నాన్నా! మాకా పిల్లలు లేరు. ఇంట్లోపెద్ద దిక్కు కూడ లేరు. అల్లుడుగారు వుద్యోగానికి వెళ్లిపోతే ఇంట్లో ఒంటరి దాన్నై, పొద్దాక ఎటూ తోచకగోళ్ళు గిల్లుకుంటూ వుండవలసి వస్తున్నది. మీరేమీ అనుకోకపోతే, మిమ్మల్ని మాయింటికి తీసుకెళ్దామని వచ్చాను. బయట ఆటో ఆగి వున్నది. పదండి పోదాం!' అని అన్నది సుజన, తండ్రి భుజాలు పొదివి పట్టుకొని లేపుతూ.

గాయాలతో ఛిద్రమైన విశ్వనాథం గుండెమీద సుజన చల్లని మాటలు మానవీయ స్పర్శతో మలాం పూస్తున్నట్టుంది.

సుజన, విశ్వనాథాన్ని తీసుకెళ్ళుతుంటే కొడుకూ కోడలూ తెలుకుట్టిన దొంగల్లా ఒకరి మొహం ఒకరు చూసుకుంటూ, అటువైపు చూడనట్టే నటిస్తూ వుండిపోయారు.

సుజన తండ్రిని ఆసుపత్రికి తీసుకెళ్లింది. ఇంజక్షన్లూ, టాబ్లెట్లూ, ఇన్‌హేలర్ కొనిచ్చింది. అందరూ రోసిన రోగిష్టి పిల్లాణ్ణి, కన్నతల్లిలా, సుజన తండ్రిని అక్కున చేర్చుకున్నది. రేయింబవళ్లూ తండ్రిని, కంటికి రెప్పలా చూసుకుంటున్నది.

తక్కువయినట్టే తక్కువయి ఓ రోజు రాత్రి ఉబ్బసం వుధృతంగా తిరగబెట్టింది.. ఖళ్ ఖళ్ మని దగ్గుతూ మంచం చుట్టూ కళ్లె వుమ్మేస్తున్నాడు. ఆయాసంతో వూపిరి పీల్చుకోలేక నరకయాతన అనుభవిస్తున్నాడు విశ్వనాథం. మాటిమాటికీ వూపిరి పీల్చుకోవడం కోసం తెరుస్తూ కనుగుడ్లు తేలేస్తున్నాడు.

మాగన్నుగా కునుకు పట్టిన సుజనకు తండ్రి దగ్గు వినిపించింది. అదాటున వులిక్కిపడి లేచి తండ్రి దగ్గరికొచ్చింది. తండ్రిని వొడిలోకి తీసుకొని టాబ్లెట్ వేసింది. ఛాతి మీద మృదువుగా నిమురుతూ నోటికి ఇన్ హేలర్ అందించింది. ఇన్‌హేలర్ పీల్చుకున్నాక ఆయాసం కొంచెం నెమ్మళించింది.

మళ్లీ ఓసారి దగ్గు తెర వచ్చింది. కాండ్రించి కళ్ళెను ఓ మూలకు ఉమ్మేసే ప్రయత్నం చేశాడు విశ్వనాథం.

"అయ్యో నాన్నా! బూడిదగిన్నె మంచం కిందనే పెట్టాను కదా! చూడలేదా? అన్నది సుజన. బూడిద గిన్నెను మంచం కింద నుంచి తీసి విశ్వనాథం ఉమ్మేయడానికి వీలుగా పెట్టింది.

అందులో ఉమ్మేస్తూ "అయ్యో సుజనా! బాధలో బూడిద గిన్నెను చూసుకోకుండా గదినిండా ఉమ్మేశానమ్మా! ' అన్నాడు విశ్వనాథం నొచ్చుకుంటూ.

"ఫర్వాలేదు నాన్నా! రేపుదయం ఎలాగూ యిల్లు కడగాలి. నేను శుభ్రం చేస్తాలే నాన్నా! నువ్వేం బాధపడకు. నెమ్మదిగా ఒత్తిగిలి పడుకో" అని తండ్రి తలకింద దిండు సరిగా పెట్టి గదిలోంచి బయటికి వెళ్ళింది సుజన.

చిన్నప్పుడు సుజనకు సెనవుండ్లులేస్తే తండ్రిగా కాకున్నా - తను ఓ మనిషిగా నైనా సానుభూతి చూపించలేకపోయాడు. పైపెచ్చు యిల్లంతా యీ రోత ఏమిటని వనజ మీదికి గయ్యిమని లేచేవాడు. సుజనను దగ్గరికి తీసుకోవడానికి కూడా మనసొప్పేది కాదు. ఇప్పుడు తాను భయంకరంగా దగ్గుతూ ఇల్లంతా వుమ్మేస్తు న్నాడు. తలుచుకుంటే తనకే రోతగా వుంది. ఈ గలీజునంతా సుజన ఎట్లా భరిస్తున్నది? తానెరిగిన సూజనేనా ఈమె? చీటికీ మాటికీ విసుక్కునే సుజనకు ఎంత ఓపిక అబ్బింది! అనుకున్నాడు విశ్వనాథం.

ప్రాథమిక దశలో గొంగళి పురుగును చీదరించుకోని వారుండరు. దాని వికృత రూపం ఎవరికైనా వికారం కలిగించక మానదు . కాలక్రమేణా ఆ గొంగళిపురుగు సీతాకోకచిలుకగా పరిణామం చెందుతుంది. కనుపాపలమీద కలలు వాలినట్టు, తన అందమైన రంగు రంగుల రెక్కలు విప్పుకొని పరిమళాలకు నెలవులైన సుకుమార సుమబాలల హృదయాల్లో విహరిస్తుంది. అప్పుడు ఎంతగా బండబారిన గుండెల్లోనైనా ఆహ్లాదం పురివిప్పుకొని నాట్యం చేయక మానదు అనుకున్నాడు విశ్వనాథం. సుజన ఇప్పుడు పరిణతి చెందిన సీతాకోకచిలుక అనుకున్నాడు. అలా అనుకుంటున్నప్పుడు గుండె లోంచి ఇన్నాళ్ళూ తనను వెన్నాడుతున్నా అపరాధ భావన తొలగిపోయి, మనసంతా హాయిగా వున్నట్టని పించింది. ఆల్చిప్పలోంచి ముత్యాలు జాలువారినట్టు మగతగా మూసుకున్న అతని కనురెప్పల్లోంచి కన్నీటి బిందువులు జాలువారు తున్నాయి.